సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం। 21 । జనవరి । 2025



సోమశిలలో 69.322 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 69.322 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3850 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.81,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,447
3 శాతం జీఎస్టీతో	రూ.7,670
నవర (8 గ్రా)	రూ.61,360

గరిష్ఠం/కనిష్ఠం
30.3 /22.0

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 67 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

నెల్లూరు (పొగతోట): నిధులు దుర్వినియోగం చేసిన విషయంలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశాల మేరకు డీపీఓ శ్రీధర్‌రెడ్డి సోమవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొడవలూరు మండలం పెమ్మారెడ్డిపాళెం పంచాయతీ కార్యదర్శి పి.శ్రీకాంత్, గతంలో పనిచేసిన కార్యదర్శి మధుసూదన్, రేగడిచెలిక పంచాయతీ కార్యదర్శి ఎస్.విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. లక్షల రూపాయల పంచాయతీ నిధుల దుర్వినియోగం అయినట్లు ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. బిల్లులు లేకుండా నిధులు ఖర్చు చేసినట్లు నిర్ధారణ కావడంతో వారిపై చర్యలు తీసుకున్నారు.

ఇద్దరు సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు

కొడవలూరు మండలం రేగడిచెలిక పంచాయతీ నిధుల ఖర్చుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేయడం, చెల్లింపులు తదితర ఆరోపణలపై సర్పంచ్ శ్రీనివాసులు చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ డీపీఓ శ్రీధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ నిధుల నుంచి రూ.10,08,104 నిబంధనలకు విరుద్ధంగా చెల్లించినట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ చేసిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేయడం, చెల్లింపులు చేయడంతో చెక్ పవర్‌ను రద్దు చేశారు. అదే మండలం పెమ్మారెడ్డిపాళెం సర్పంచ్ నవీన్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ డీపీఓ శ్రీధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేయడం, చెల్లింపులు విషయంపై ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులపై వివరణ కోరుతూ షోకాజు నోటీసులు జారీ చేశారు. అయితే సర్పంచ్ నుంచి ఎటువంటి సంజాయిషీ రాకపోవడంతో చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు.

ట్రాక్‌మెన్ల యుద్ధభేరి



బిట్రగుంట పీడబ్ల్యూ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ట్రాక్‌మెన్‌లు

బిట్రగుంట: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ట్రాక్‌మెన్‌లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బిట్రగుంటలో సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో 'యుద్ధభేరి' పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీడబ్ల్యూ కార్యాలయం ఎదుట ట్రాక్‌మెన్‌లు నిరసన ప్రదర్శన నిర్వహించి తమ డిమాండ్లపై నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ కీమెన్‌ల పనిభారం తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. నైట్ పెట్రోలింగ్‌లో ఇద్దరు కీమెన్‌లను కేటాయించాలని, మహిళా ట్రాక్‌మెన్లను వేరే విభాగాలకు బదిలీ చేయాలని కోరారు. నైట్ పెట్రోలింగ్ మెన్ బీట్ పరిధిని 10 కి.మీ. లోపు కుదించాలని, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ చైర్మన్ మద్దిబోయిన వెంకటశేఖర్, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు మధు, నరసయ్య, మైకేల్, శైలేష్, రఘు, మహేంద్ర, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

నగర డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరు నగర నూతన డీఎస్పీగా పెసర సింధుప్రియ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తొలుత రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలోని సబ్‌డివిజన్ కార్యాలయానికి చేరుకున్న ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. చిన్నబజారు, నవాబుపేట, దర్గామిట్ట, వేదాయపాళెం, బాలాజీనగర్, సౌత్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, రోశయ్య, శ్రీనివాసులురెడ్డి, సాంబశివరావు, వెంకటరెడ్డి, రామకృష్ణలు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తాము తీసుకోనున్న చర్యలకు సహకరించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎస్పీ జి.కృష్ణకాంత్, ఏఎస్పీ సుప్రజలను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

సమయపాలన పాటించరాయె!

- సకాలంలో విధులకు రాని తహసీల్దార్లు
- ఒకవేళ వచ్చినా ఆలస్యంగా..
- మొక్కుబడిగా విజ్ఞాపనల స్వీకరణ
- ఎక్కడి సమస్యలు అక్కడే..
- అందుకే కలెక్టరేట్‌కు ప్రజల పరుగులు

కూటమి ప్రభుత్వంలో ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రతి వారం వ్యయప్రయాసలు పడి వచ్చి అధికారులకు ఇచ్చిన అర్జీలకు అతీగతీ ఉండడం లేదు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు కుప్పలు తెప్పలుగా పోగుపడుతున్నాయి. ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో పనిచేసే అధికారులు కార్యాలయాలకు హాజరై ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో తహసీల్దార్ కార్యాలయాలను 'సాక్షి' బృందం సోమవారం విజిట్ చేయగా పలు విషయాలు వెల్లడయ్యాయి. కొందరు తహసీల్దార్లు సకాలంలో విధులకు హాజరు కాలేదు. కొందరు ఆలస్యంగా వచ్చారు. మరికొందరు ఆఫీసు పనిపైనే వేరే చోటుకు వెళ్లారని అక్కడి సిబ్బంది తెలిపారు. మొత్తంగా తహసీల్దార్ల కార్యాలయాల్లో నెలలుగా సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో దూరాభారమైనా జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకే ప్రజలు వెళ్తున్నారు.



ఉదయం 10.25 నిమిషాలకు ఖాళీగా దర్శనమిస్తున్న అధికారుల కుర్చీలు

విధులకు హాజరు కారు.. సేవల్లో నిర్లక్ష్యం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయ అధికారుల నుంచి సిబ్బంది వరకు నిర్లక్ష్య ధోరణి కనిపించింది. సోమవారం కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరుగుతున్న తీరుపై 'సాక్షి' విజిట్ చేసింది. అధికారులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కాలేదు. ప్రజలకు అందించే సేవల్లోనూ నిర్లక్ష్యం బయటపడింది. అధికారుల కంటే ముందే ముగ్గురు అర్జీదారులు వచ్చారు. 10.45 గంటల వరకు తహసీల్దార్ లాజరస్ హాజరు రాలేదు. కార్యాలయ సిబ్బంది సైతం తహసీల్దార్ వచ్చే సమయానికే విధులకు హాజరయ్యారు. అప్పటి వరకు అర్జీదారులు కార్యాలయం బయట పడిగాపులు పడాల్సి వచ్చింది. సమయ పాలనపై 'సాక్షి' తహసీల్దార్‌ను వివరణ కోరగా కోర్టు కేసు ఉన్న నేపథ్యంలో ఆలస్యమైందని బదులిచ్చారు.

ఒక్క అర్జీ కూడా రాలేదు



ఉదయం 10.35 గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీలు

వరికుంటపాడు: ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక ప్రజాదరణ కోల్పోయింది. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఒక్కరంటే.. ఒక్క అర్జీదారుడు కూడా హాజరు కాలేదంటే ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమాన్ని 'సాక్షి' పరిశీలించింది. ఉదయం 10 గంటలకు జూనియర్ సహాయకులు రాగా, 10.30 గంటల వరకు అధికారులు, సిబ్బంది హాజరుకాలేదు. 10.42 గంటలకు డీటీ వచ్చారు. 10.25 గంటలకు ఆర్‌అండ్‌బీ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్, 10.35 గంటలకు హాస్టల్ వార్డెన్ హాజరయ్యి సంతకాలు చేసి కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్ కోర్టు పనిపై అమరావతి వెళ్లినట్టు డీటీ తెలిపారు.

తహసీల్దార్ వచ్చినా... సిబ్బంది రారే..!?

కావలి: కావలి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వచ్చినా సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. ఉదయం 10.20 గంటలకు తహసీల్దార్ పి.శ్రావణ్‌కుమార్ కార్యాలయానికి చేరుకున్నారు. నేరుగా తన సీటులో కూర్చొని, అప్పటికే తన టేబుల్‌పై ఉన్న వివిధ ఫైళ్లను పరిశీలించి వాటిపై సంతకాలు చేశారు. తన వద్దకు వచ్చిన అర్జీదారులను ఎదురుగా ఉన్న కుర్చీల్లో కూర్చోమని చెబుతూ ఫైళ్లు చూస్తూ సంతకాలు పెడుతున్నారు. సరిగ్గా 11 గంటలకు ఆ పని ముగియడంతో అర్జీదారులతో మాట్లాడటం, వారు చెప్పిన సమస్యలు వినడం ప్రారంభించారు. కాగా 10.45 గంటల తర్వాత కార్యాలయ సిబ్బంది ఒక్కొక్కరు విధులకు రాగాసాగారు.



కావలి: ఉదయం 10.45 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సిబ్బంది కుర్చీలు

ఇంటి స్థలం కోసం

కార్యాలయానికి వచ్చిన గోళ్ల రమణమ్మ వద్ద ఇంటి పట్టా ఉంది. దానిపై అక్షరాలు కనిపించడం లేదు. అది 30 ఏళ్ల క్రితం నాటి తహసీల్దార్ జారీ చేసిన పట్టాలా అనిపిస్తోంది. పట్టా పట్టుకుని ఆమె తహసీల్దార్ కార్యాలయం వద్దకు ఉదయం 9.30 గంటలకు చేరుకుంది. చాలా ఏళ్ల క్రితం పట్టా ఇచ్చారు. ఆ స్థలం చూపించమని తిరుగుతున్నా.. పరిష్కారం కాలేదని బయట దీనంగా కూర్చొని వచ్చిపోయే వారికి చెబుతోంది.

మాజీ సైనికుడికి తప్పని కబ్జాదారుల కష్టాలు

కావలి పట్టణంలోని శాంతినగర్‌లో దాసరి ఆదినారాయణ అనే సైనికుడు 30 ఏళ్ల క్రితం 25 సెంట్ల భూమి కొనుగోలు చేశాడు. సైనికుడిగా రిటైర్డ్ అయిన తర్వాత కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లిపోయి అక్కడే స్థిరపడ్డారు. ఆదినారాయణకు చెందిన భూమిలో కొంత భాగాన్ని ఆ చుట్టుపక్కల వ్యక్తులు స్వాధీనం చేసుకొని నివాసాలను నిర్మించుకున్నారు. దీంతో దాసరి ఆదినారాయణ దంపతులు సోమవారం కావలికి చేరుకుని తహసీల్దార్ పి.శ్రావణ్‌కుమార్‌ను కలిసి తమ గోడును చెప్పుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమకు కబ్జాదారులు ఇలాంటి శిక్ష వేయడమేమిటని తహసీల్దార్‌కు దీనంగా చెప్పుకున్నారు. పరిశీలించి తన పరిధిలో తీసుకోగలిగే చర్యలను తీసుకుంటానని మాజీ సైనికుడు దంపతులకు తహసీల్దార్ చెప్పారు.



తహసీల్దార్‌కు తమ గోడును చెప్పుకుంటున్న మాజీ సైనికుడి దంపతులు

ఆర్డీఓ కార్యాలయం.. అతీతం కాదు

ఆత్మకూరు: విధి నిర్వహణలో సమయపాలన పాటించడంలో, సమస్యల పరిష్కారంలో అలవికాని జాప్యం చేయడంలో ఆర్డీఓ కార్యాలయ అధికారులు అతీతులు కారని సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక రుజువు చేసింది. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని 'సాక్షి' విజిట్ చేసింది. ఆర్డీఓ 10.10 గంటలకే కార్యాలయానికి చేరుకోగా తహసీల్దార్ 11.10 గంటలకు వచ్చారు. అప్పటికే రెండు మార్లు తహసీల్దారు గురించి ఆర్డీఓ వాకబు చేయడం గమనార్హం. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా కేవలం ఐసీడీఎస్, బీసీ సంక్షేమ శాఖల సిబ్బంది హాజరు కావడం విశేషం.

కాళ్లరిగేలా తిరుగుతున్నా.. పరిష్కారం శూన్యం



రోడ్డు నిర్మాణం కోసం నాకు చెందిన 31 సెంట్ల భూమిని తీసుకున్నారు. రెండేళ్ల నుంచి నష్ట పరిహారం కోసం కలువాయి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. గత వారంలో ఆర్డీఓ ఆదేశించినా మండల అధికారులు ఖాతరు చేయలేదు. వీఆర్‌ఓ సర్టిఫికెట్ ఇస్తేనే అవార్డు చెక్కు ఇస్తామని చెబుతున్నారంటూ బాధితుడు ఆర్డీఓ పావని దృష్టికి తీసుకెళ్లారు.

– పలుకూరి బ్రహ్మయ్య, లలితానగర్

ఆలస్యంగా అధికారుల హాజరు

కందుకూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి అధికారులు ఆలస్యంగా హాజరయ్యారు. తహసీల్దార్ ఇక్బాల్, ఏఓ మినహా మిగిలిన అధికారులందరూ 10.30 గంటల తర్వాతే వచ్చారు. రెండు అర్జీలు మాత్రమే అందాయి. కందుకూరులోని ప్రకాశం కాలనీకి చెందిన పి.హెబ్సిబా అనే దివ్యాంగురాలికి సంబంధించిన ఇంటి స్థలాన్ని కె.ఆదాము అనే వ్యక్తి కొంత ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించుకున్నాడు. ఆక్రమణను తొలగించి స్థలం హద్దు చూపించాలని తల్లి రత్తమ్మతో కలిసి తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

మూడు నెలలుగా తిరుగుతున్నా..



మాది మొగిలిచర్ల. మేము ఇద్దరం అన్నదమ్ములం. పొలాలు పంచుకుని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. అయితే పొలమంతా మా అన్న మీద ఆన్‌లైన్ చేశారు. మా అన్నపై ఉన్న సగం పొలాన్ని ఆన్‌లైన్ నా పేరు మీదకు మార్చమని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాను. వీఆర్వో, ఆర్ఐ రేపు చేస్తాం.. ఎల్లుండి చేస్తామ ని తిప్పుకుంటున్నారు.

– పల్లపోతు గోవిందయ్య రైతు, మొగిలిచర్ల, లింగసముద్రం మండలం

అధికారులు డుమ్మా.. మొక్కుబడిగా విధులు



10.20 గంటలకు అరకొరగా హాజరు

ఉదయగిరి: ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు విధులకు డుమ్మా కొడుతున్నారు. ఒక వేళ వచ్చినా సమయపాలన పాటించడం లేదు. ఈ కార్యక్రమానికి 17 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉన్నా.. అందరూ రావడం లేదు. కొంత మంది మండల స్థాయి అధికారులు తమకు బదులు కింది స్థాయి సిబ్బందిని పంపుతున్నారు. ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఉదయం 10 గంటలకు తహసీల్దార్ సుభద్రతోపాటు నాలుగు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఆ తర్వాత 12 గంటల వరకు పలు శాఖల అధికారులు, సిబ్బంది ఒక్కొక్కరు వస్తూనే ఉండడం గమనార్హం. మొక్కుబడిగా విధులు నిర్వర్తిస్తున్నారని స్పష్టమైంది. భూ సమస్య పరిష్కారం కోసం కేవలం ఒకే ఒక వ్యక్తి అర్జీ ఇచ్చారు.

రెడ్‌బుక్ పేరుతో రాక్షస పాలన



నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- సాధారణ పౌరులకు భద్రత కరువైంది
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలో రెడ్‌బుక్ పేరుతో రాక్షస పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. టీడీపీ నేతల చేతిలో గాయపడి నెల్లూరు నగరంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ముత్తుకూరు బిట్–2 ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లును సోమవారం పలువురు నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నిత్యం దాడులు, దండయాత్రలతో ప్రజల్ని అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కేవలం పార్టీ మారలేదన్న కక్షతో వెంకటేశ్వర్లుపై దాడికి పాల్పడ్డారన్నారు. చికిత్స అందిస్తున్న వైద్యులు వెంకటేశ్వర్లు కాలు తుంటికు శస్త్రచికిత్స చేయాలని చెబుతున్నారన్నారు. ఇంత జరిగినా పోలీసులు మీనమేషాలు లెక్కిస్తూ ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయలేదన్నారు. అధికారం అనేది ఎవరికీ శాశ్వతం కాదని.. ఈరోజు మీరు చేస్తున్న పాపాలు శాపాలుగా మారి భవిష్యత్తులో వెంటాడుతూనే ఉంటాయన్నారు. ఎంపీటీసీ వెంకటేశ్వర్లు మీద జరిగిన దాడిపై పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోతే తాము ప్రైవేట్ కేసు వేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పలువురు పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెస్ టార్గెట్ పూర్తి చేయండి

- సెక్రటరీలకు జేడీ ఆదేశం

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలకు సెస్ వసూళ్ల విషయంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు ఇచ్చిన టార్గెట్‌ను ప్రతి ఒక్క సెక్రటరీ పూర్తి చేయాలని వ్యవసాయశాఖ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. నెల్లూరులోని ఏఎంసీ హాలులో నెల్లూరు, ప్రకాశం జిల్లాల మార్కెటింగ్ శాఖ సెక్రటరీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ టార్గెట్ పూర్తి చేయడానికి కేవలం రెండున్నర నెలలు కూడా లేదన్నారు. ఈ ఏడాది పంట వేసేదాంట్లో కొంత తేడా వచ్చిందని, కానీ టార్గెట్ విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు సెక్రటరీలు పాల్గొన్నారు.



సెక్రటరీలతో సమావేశం నిర్వహిస్తున్న జేడీ శ్రీనివాసులు

రికార్డు స్థాయిలో వినతులు

- కలెక్టరేట్‌కు పోటెత్తిన జనం
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 405 అర్జీల అందజేత
- మండలాల్లో పరిష్కారం కాకపోవడంతోనే..
- రెవెన్యూ సమస్యలే అధికం


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

నెల్లూరు రూరల్: మండలాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మొక్కుబడిగా జరుగుతోంది. నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరుగుతున్న కార్యక్రమానికి అందుతున్న వినతుల సంఖ్యే ఇందుకు నిదర్శనం. ఈ సోమవారం కూడా జనం పోటెత్తారు. తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రికార్డు స్థాయిలో 405 అర్జీలు వచ్చాయి. అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 163 అర్జీలందాయి. పోలీస్ శాఖవి 73, మున్సిపల్ శాఖవి 50, సర్వేవి 18, పంచాయతీరాజ్ శాఖవి 31, సివిల్ సప్లయీస్‌కు సంబంధించి 7 అర్జీలు తదితరాలున్నాయి.

అధికారుల నియామకం

కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీల పరిష్కారాన్ని ఆడిట్ చేయడానికి 19 మంది జిల్లా అధికారులను నియమించామన్నారు. ఆడిట్ చేసిన వాటిలో కొన్నింటిని తన పరిశీలనకు పంపాలని ఆదేశించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డ్వామా పీడీ గంగా భవానీ, డీఎంహెచ్‌ఓ సుజాత, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలంటూ..


మాట్లాడుతున్న వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ నాయకులు

'జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. యాజమాన్యాలు నిబంధనల మేరకు బస్సులు నడపకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి' అని వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ నేతలు అన్నారు. జిల్లా అధ్యక్షుడు ముంగమూరు అశ్రిత్‌రెడ్డి, నేతలు స్కూల్ బస్సుల ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు చెందిన సుమారు రెండు వేలకు పైగా బస్సులున్నాయన్నారు. గడిచిన నాలుగు నెలల వ్యవధిలో పలుచోట్ల ప్రమాదాలు జరిగి విద్యార్థులు గాయపడ్డారన్నారు. కారణాలను లోతుగా పరిశీలించాలని, వాహనాల కండీషన్‌ను తనిఖీ చేయాలని కోరారు. బస్సు వేగం 40 కిలోమీటర్లకు మించకుండా చూడాలన్నారు. విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తౌఫిక్, చంద్ర, లిఖిత్, ఉస్మాన్, సిద్ధా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇందుకూరుపేట మండలంలోని మైపాడు బీచ్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారని, వారికి తగిన భద్రత, వసతులు కల్పించాలని మండల బీజేపీ నేతలు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు అలల తాకిడికి గురై ప్రాణాలు కోల్పోతున్నారని, వెంటనే భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. బీచ్ పరిసర ప్రాంతాల్లో మహిళలకు రక్షణ లేదని, అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వెంటనే గస్తీని ముమ్మరం చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ గాంధీ, సతీష్‌రెడ్డి, అవినాష్ రెడ్డి, నెల్లూరు శ్రీనివాసులు, చేవూరు వెంకట్రావు, చేవూరు భాస్కర్‌రావు, మురళి, వాకాటి ప్రసాద్, శరత్, నెల్లూరు వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

వివిధ అంశాలపై..


కలెక్టరేట్ ఎదుట ధర్నా

నెల్లూరు జిల్లా యునైటెడ్ చౌక ధరల దుకాణదారుల సంక్షేమ సంఘం నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రేషన్ డీలర్లకు ఎండీయూ ఆపరేటర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంకా వివిధ అంశాలపై ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

మోసాలను వివరించి.. చర్యలు కోరి..

- ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- ఫిర్యాదులు స్వీకరించిన ఏఎస్పీ సౌజన్య


ఫిర్యాదును పరిశీలిస్తున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైమ్): నాకు తెలియకుండా బ్యాంక్ లోన్ తీసుకున్నారని ఒకరు.. ప్రేమపేరిట వంచించారని మరొకరు.. నా పేరుపై లోన్ తీసుకుని కట్టలేదని ఇంకొకరు.. ఇలా పలువురు తమకు జరిగిన మోసాలను ఏఎస్పీ సీహెచ్ సౌజన్య దృష్టికి తీసుకొచ్చారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 97 మంది తమ సమస్యలపై ఏఎస్పీకి ఫిర్యాదులు అందజేశారు. చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాకు తెలియకుండా..

మనోహర్ అనే వ్యక్తి నా పేరుపై ఎస్సీ కార్పొరేషన్‌లో సబ్సిడీ లోన్ తీసుకున్నాడు. నగదు చెల్లించకపోవడంతో నాకు నోటీసులు వచ్చాయి. దీనిపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నాడు. విచారించి న్యాయం చేయాలని అల్లూరుకు చెందిన ఓ మహిళ విజ్ఞప్తి చేశారు.

ప్రేమ పేరిట వంచన

కలువాయి మండలానికి చెందిన సికిందర్ నన్ను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇద్దరం దగ్గరయ్యాం. ప్రస్తుతం నేను గర్భవతిని. పెళ్లి చేసుకోవాలని సికిందర్‌ను అడిగితే నిరాకరించడమే కాకుండా దౌర్జన్యం చేస్తున్నాడని సైదాపురానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

లోన్ తీసుకుని..

హైదరాబాద్‌కు చెందిన మహేష్ మరో ఇద్దరు కలిసి ప్రముఖ బ్యాంకులో నా పేరుపై ఖాతాను తెరిచారు. రూ.5 లక్షలు లోన్ తీసుకుని కట్టలేదు. నన్ను మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాలాజీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి అర్జీ ఇచ్చాడు.

వేధిస్తున్నాడు

కావలికి చెందిన ఓ వ్యక్తి కోర్కె తీర్చాలని, లేనిపక్షంలో ఉద్యోగపరంగా ఇబ్బంది పెడతానంటూ వేధిస్తున్నాడని అతడిపై చర్యలు తీసుకోవాలని దగదర్తి మండలానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

కుమార్తె ఆచూకీ కోసం..

నా కుమార్తె నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. నెలరోజుల క్రితం కళాశాలకు వెళ్లి అదృశ్యమైంది. ఆమె కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. విచారించి ఆమె ఆచూకీ తెలియజేయాలని వెంకటాచలసత్రానికి చెందిన ఓ మహిళ అభ్యర్థించారు.

కాపురాన్ని చక్కదిద్దండి

12 ఏళ్ల క్రితం బుజబుజనెల్లూరుకు చెందిన ఓ వ్యక్తిని కులాంతర వివాహం చేసుకున్నాను. కొంత కాలం మా కాపురం సజావుగా సాగింది. ప్రస్తుతం నా భర్త నన్ను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. కౌన్సెలింగ్ ఇచ్చి కాపురాన్ని చక్కదిద్దండి.

కసుమూరులో కార్డన్ సెర్చ్

- ఏడు మోటార్‌బైక్‌ల స్వాధీనం
- పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వెంకటాచలం: నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని కసుమూరులో సోమవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్‌ను నిర్వహించారు. సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది మొత్తం 130 మందికి పైగా కసుమూరు పంచాయతీ పరిధిలోని దర్గా సెంటర్, ఎస్టీ కాలనీ, పెద్దూరు, తిప్ప చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 300 నివాసాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాల్లేని ఏడు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకుని వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి వివరాలు ఆరాతీశారు. అద్దె గృహాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. షేక్ నౌషాద్‌కు చెందిన గృహాల్లో రెండు జంటలను అదుపులోకి తీసుకుని, నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.35
సన్నవి : రూ.20
పండ్లు : రూ.15

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 88
బ్రాయిలర్ చికెన్	: 236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 260
లేయర్ చికెన్	: 150

ఉమ్రా యాత్ర పేరిట టోకరా

- ఇప్పటికే వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో కేసు
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

నెల్లూరు(క్రైమ్): ఉమ్రా యాత్రకు పంపుతామని పలువురు ముస్లింల నుంచి నగదు వసూలు చేసి బోర్డు తిప్పేసిన ట్రావెల్స్ సంస్థ మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే నెల్లూరు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా తాజాగా సోమవారం పెద్ద ఎత్తున ముస్లింలు ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. చెన్నైకు చెందిన నాజ్ ఉమ్రా సర్వీసెస్ నిర్వాహకుడు జాఫర్, అతడి పీఏ సలాం పలు జిల్లాల్లో ఏజెంట్లను నియమించుకున్నారు. వారి ద్వారా తక్కువ (ఒక్కో మనిషికి రూ.55 వేల నుంచి రూ.60 వేలు)ఖర్చుతో ఉమ్రా యాత్రకు పంపుతామని ప్రకటనలిచ్చారు. కొందరిని యాత్రకు పంపి నమ్మకం సంపాదించుకున్నారు. గతేడాది నవంబర్, డిసెంబర్‌లో చాలామంది ముస్లింలు సదరు సంస్థకు డబ్బు చెల్లించి పాస్‌పోర్టులను సైతం అప్పగించారు. ఈనెలలో వారు ఉమ్రా యాత్రకు వెళ్లాల్సి ఉండటంతో అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోసాగారు. ఈనెల మొదట్లోనే సంస్థ కార్యాలయాన్ని మూసివేసి నిర్వాహకులు ఎటో వెళ్లిపోయారు. వారి ఫోన్లను స్విచ్ఛాఫ్ చేశారు. పలువురు బాధితులు చెన్నైకి వెళ్లి వారికోసం ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. సంస్థ మోసంపై వెంగళరావ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఖాదర్ షరీఫ్ ఫిర్యాదు మేరకు ఈనెల 17వ తేదీన వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరెడ్డి ప్రత్యేక బృందాన్ని చెన్నైకు పంపారు. విచారణలో మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

ఫిర్యాదుల వెల్లువ

సంస్థ మోసాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నెల్లూరు నగరంలోని వెంగళరావ్‌నగర్, మహాత్మా గాంధీనగర్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాలకు బాధితులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. ట్రావెల్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.

27 మంది నుంచి..

నెల్లూరు నగరానికి చెందిన అనీస్ ట్రావెల్స్ సంస్థ ఏజెంట్. అతను నెల్లూరు నగరంలో 27 మందిని ఉమ్రా యాత్రకు పంపుతానని ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.55 వేలు చొప్పున రూ.14.85 లక్షలు వసూలు చేసి వాళ్ల పాస్‌పోర్టులు తీసుకున్నాడు. ఈనెల మొదటి వారంలో వారిని యాత్రకు పంపాల్సి ఉండగా ఏజెంట్ కాలయాపన చేయసాగాడు. ఇటీవల గట్టిగా నిలదీయడంతో సరైన సమాధానం చెప్పలేదు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు విచారిస్తున్నారు. మొత్తంగా ట్రావెల్స్ సంస్థ బాధితులు సుమారు 200 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది.

యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా

- టీడీపీ నాయకుల నిర్వాకం
- రెవెన్యూ అధికారులను లెక్క చేయని వైనం


శంఖవరంలో ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న దృశ్యం

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని శంఖవరంలో సర్వే నంబర్లు 208, 209లో సుమారు 12 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం యంత్రాలతో చెట్లు తొలగించే ప్రక్రియను ప్రారంభించారు. దీనిపై పలువురు గ్రామస్తులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీఆర్‌ఏ ఆక్రమణదారులతో మాట్లాడి పనులు ఆపించారు. కొంతసేపటి తర్వాత మళ్లీ చదును చేసే పనులను ప్రారంభించారు. మళ్లీ స్థానికులు తహసీల్దార్ షేక్ హమీద్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే వీఆర్వో, ఆర్‌ఐను ఘటనా స్థలం వద్దకు పంపి పనులు నిలిపేయించారు. గ్రామానికి అతి సమీపంలో జగనన్న లేఅవుట్ దగ్గరగా ఉన్న ఈ ప్రభుత్వ భూమి ఎంతో విలువైంది కావడంతో ఆక్రమించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం దీని విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.

అప్పట్లో స్వాధీనం

ఈ భూమిని పదేళ్ల క్రితం కొందరు గ్రామస్తులు ఆక్రమించి సాగు చేశారు. 2023లో వివాదం నెలకొని రెండు వర్గాలు మధ్య గొడవలు జరగడంతో రెవెన్యూ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరూ భూమిలోకి ప్రవేశించకుండా బోర్డు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ షేక్ హమీద్‌ను వివరణ కోరగా మంగళవారం బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదన్నారు.

అప్పుడు భయపెట్టి.. ఇప్పుడు జై కొట్టి..

- కోవూరుపల్లిలో భూముల రీ సర్వే ప్రారంభం
- ఆర్భాటంగా టీడీపీ నేతల ప్రచార ర్యాలీ



కోవూరుపల్లిలో నిర్వహించిన భూముల రీ సర్వేలో పాల్గొన్న టీడీపీ నాయకులు

బిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లిలో భూముల రీ సర్వే ప్రక్రియను పైలట్ ప్రాజెక్ట్‌గా సోమవారం పునః ప్రారంభించారు. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించిన భూముల రీ సర్వే ప్రక్రియపై విష ప్రచారం చేసిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తిగా రద్దు చేస్తామని, పాత పద్ధతినే కొనసాగిస్తామని ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నేతలు ఊదరగొట్టారు. బహిరంగ సభల్లో, సోషల్ మీడియాలో, ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా భూముల రీ సర్వేపై టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో విష ప్రచారం నిర్వహించారు. అయితే అధికారం దక్కాక కూటమి ప్రభుత్వం తాజాగా పైలట్ ప్రాజెక్ట్ పేరుతో భూముల రీ సర్వే చేపట్టడం గమనార్హం. తాజాగా 'ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్' పేరుతో భూముల రీ సర్వేకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో జనాలు అవాక్కవుతున్నారు. గతంలో జరిగిన రీ సర్వేను రద్దు చేయకుండా, తప్పులు సవరించకుండా కొత్తగా రీసర్వే చేపట్టడంపై ప్రజలతో పాటు అధికారుల్లోనూ కూడా గందరగోళం నెలకొంది. గతంలో జరిగిన రీ సర్వేలో దొర్లిన తప్పులు సవరిస్తామని ఇప్పటికే రెండుసార్లు గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీకరించినా.. ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అంతలోనే మళ్లీ రీ సర్వే పునః ప్రారంభించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా సోమవారం కోవూరుపల్లిలో రీ సర్వే ప్రారంభిస్తూ అధికారులతోపాటు టీడీపీ నాయకులు ఆర్భాటంగా ర్యాలీ, గ్రామసభ నిర్వహించారు. ఎన్నికలకు ముందు తీవ్రంగా విమర్శించిన టీడీపీ నాయకులు ఇప్పుడు రీ సర్వేకు జై కొడుతూ ర్యాలీలు నిర్వహించడంపై జనం విస్తుపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి: దాసరపల్లికి చెందిన గొల్లపల్లి అభిలాష్ సోమవారం మధ్యాహ్నం ఉదయగిరి పట్టణంలో పనులు ముగించుకుని తల్లి అరుణతో మోటార్‌బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. దాసరపల్లి సమీపంలో ఉన్న ఎగువ క్రాస్ వద్ద వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో అప్పసముద్రం నుంచి ఉదయగిరి వస్తున్న 104 వాహనంలోని హెల్త్ అసిస్టెంట్ మన్సూర్‌అలీ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి ఆటోలో ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు వారికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు జిల్లా ఆస్పత్రికి పంపించారు.